# పొడి మబ్బులు

## కొండేపూడి నిర్మల

"ఏమ్మా వీటినిలాగేనా వుంచుకునేది? చదువుకున్న దానిలాకనిపిస్తున్నావ్. ఏడో నెల నుంచీ నిప్పిల్ ఎక్సర్‌సైజ్ చెయ్యాలని తెలీదా?" డాక్టర్ మెత్తగానే చివాట్లేసింది.

"చూశావా యిటు... పాలొచ్చే దారిలేక గట్టిపడి పోయాయి రెండూ"స్టెత్ తో స్తనాల మీద చిన్నగా తట్టి, మళ్ళీ ఆలోచించి "రైట్ సైడ్ దారికి తేవచ్చునుకో. లెఫ్ట్ సైడ్ కష్టం. నిప్పిల్ షీల్డ్ తప్పదు. బజార్లో దొరుకుతుంది తెప్పించుకో. ఈ గడ్డనిలా వదిలేస్తే కాన్సరొస్తుంది" కాజువల్‌గా అంటూ కాగితం మీద ఏదో రాసిచ్చింది.

వింధ్యకు భయంతో వొళ్ళు జలదరించింది.

"తెలీలేదు డాక్టర్... తనకే వినిపించనంత నెమ్మదిగా గొణిగింది.

"ప్రస్తుతానికి వాక్యూమ్ చెయ్యమని చెబుతాను. ఆ గదిలోకెళ్ళు" ఆజ్ఞాపించింది డాక్టరు.

"రండమ్మా" పిలిచింది నర్సు.

కన్సల్టింగ్ రూముకి కొంచెం దూరంగా వున్న చిన్న గదిలోకెళ్ళింది వింధ్య.

వుండలు కట్టిన రబ్బరు పరుపు, నలుపు రంగుకి తిరిగిన దిండుతో, ఎక్కి పడుకోడానికి రెండు మెట్లున్న చెక్క స్టాండుతో బెడ్డు రెడీగా వుంది. ఎక్కబోయి ఆగి కిటికీల మీదకు కర్టెన్లు జరిపి బల్లమీద కూర్చుంది వింధ్య.

"ఆ కిటికీ లెందుకు మూస్తావ్, అసలే గాలాడ్డం లేదు. ఇటొచ్చి నుంచో, ఏమీ కనిపించదులే కంగారు పడకు" అంటూ కర్టెన్లు పక్కకి జరిపేసి దగ్గరకొచ్చింది నర్సు. పైట తప్పించి చక చకా జాకెట్టు గుండీలు తీసింది. కిటికీ వైపు చూడ్డానికి కూడా ధైర్యం చాలక మొహమాటంగా నుంచుంది వింధ్య. గరాటు ఆకారంలో వున్న చిన్న గాజు గొట్టాన్ని రొమ్ముపై బోర్లించి దాని కాడకున్న రబ్బరు బుడగని నొక్కసాగింది. మొదట చల్లగా కిత కితగా బావే వున్నా గొట్టంలో గాలంతా ఆయి పోయి క్రమ క్రమంగా రొమ్ము చర్మం సాగి దాంట్లోకి యిరుక్కుపోవడం మొదలెట్టింది. ప్రాణాలు జల్లార్చుకు పోయే బాధతో పాలు ధారగా కారడం కనిపిస్తున్నాయి. యివాల్టివి, నిన్నటివి, మొన్నటివి...

"యింక చాలు" గింజుకుంది వింధ్య. సిగ్గుతోనూ బాధతోనూ. రెండో స్తనానికి కూడా పాలు తీసి వాక్యూమ్ గొట్టాన్ని డెట్టాల్ నీళ్ళతో కడిగింది నర్సు. దాదాపు చిన్న గ్లాసు పాలు సింకులో పారబొయ్యడం చూసి ఉసూరుమనిపించింది. పాల జ్వరం తగ్గిన సూచనగా వళ్ళంతా చెమట పట్టింది.

నిప్పిల్ ఎక్సర్ సైజ్ అంటే ఏమిటి? యివ్వుడు చెయ్యకూడదా? అనుమాన మొచ్చింది కాని అడగడానికి సిగ్గేసి మానేసింది. వార్డులో కొచ్చే సరికి చెంచాతో పసిదానికి గ్లూకోజు నీళ్ళు పడుతోంది అమ్మ.



"ఇదేమి చోద్యమే! పాలుండి కూడా యివ్వలేకపోవడమేమిటి? యిందులో కూడా ఆ దిక్కుమాలిన మేనత్త పోలికలే రావాలా?" కూతుర్ని చూడగానే ఆగ లేక అడిగేసింది. ఎవరు వింటారో ఏమిటోనని ప్రాణం చచ్చినట్టు చుట్టూ చూసి గోడ వైపు తల తిప్పుకుని కూర్చుండి పోయింది వింధ్య.

"వీటినసలు ముట్టుకోడా నీభర్త? ఏడో నెల మంచీ సకింగ్ టచ్ యివ్వాలి తెలుసా. అప్పుడు మాత్రమే బిడ్డ నోటికి నిప్పిల్స్ అందుతాయి. పోనీ మధ్య స్నానం చేసేటప్పుడైనా మానె తోవో, వెన్నతోనో రోజు ...టివి సావు చేసినా ఈ బాధ వుండక పోను." నర్సు మాటలు మొత్తం అశ్లీల చిత్రంలో డైలాగుల్లా గుర్తుకు రావడం మెదలెట్టాయి.

"ఏమిటి విని పిస్తుందా రేపొద్దున డిశ్చార్జ్ అయి ఇంటికెళ్ళాక అయినా వీటిని స్వాధీనం తెచ్చుకోక తప్పదు. మీ ఆయనతో నువ్వే చెప్తావా నన్ను చెప్పమంటావా" బెదిరింపు గుర్తొచ్చి తల విదిలించింది.

"వొద్దొద్దు నేనే చెప్తాను..." తోచీ తోచని కంగారులో అనేసింది కానీ, ఆ మట్టి మనిషితో ఏం చెప్పాలో ఎలా చెప్పాలో అర్థం కాకుండా వుంది. పెళ్ళయింది మొదలూ.. ఆ టైములో కూడా వాటిని రెండుమాంసం ముద్దల్లా భావించి ఎడా

పెడా నలగ్గొట్టడమే తప్ప మృదుత్వం, లాలనా వుంటాయని వాటి ప్రేరణతో బిడ్డకు పాలిస్తున్నప్పుడు కొన్ని ఇబ్బందులు తగ్గుతాయని ఎవరు చెబుతారు? అవడానికి మళ్ళీ ఎమ్మే పి.హెచ్‌డి. అట! ఎందుకది? గోదాట్లో కలపడానికా? పోనీ తనకి మాత్రం ఏం తెలుసు? అసలు ఏ సిలబస్‌లో మాత్రం ఈ విషయం ఏడిచిందని...! తర్కించుకోవడం మొదలెట్టింది వింధ్య.


నిప్పిల్ షీల్డ్ కొనుక్కొచ్చి యిచ్చాడు తమ్ముడు.

అమ్మ నిష్ఠూరంగా దాని కేసి చూస్తూ పొట్లం విప్పదీసి అందులో వున్న వస్తువొకటి చేతికిచ్చింది.

ఎటు తిరిగినా మగవాళ్ళే. పక్క బెడ్స్ తాలూకూ తండ్రులు, భర్తలు, స్నేహితులు...

దోసెడంత ఏకాంతం కోసం దీనంగా అంతా కలియ చూసి ఎటూ దొరక్క పోయే సరికి కంగారు పడసాగింది వింధ్య.

చంటిది మొహం చిట్లించి వొళ్ళు విరుచుకుంటూ నిద్ర లేచి కయ్యుమని అరిచింది. నీరసంగా పిల్లి పిల్లలా ఏడుస్తున్న దాని శబ్దానికి గుండెల్లో కెలికి వట్టనిపించి దగ్గరకు తీసుకుంది. పైట చాటు చేసి స్తనాన్ని బైటికి కనిపించకుండా బిడ్డ మీదకు వొంగి పాలివ్వడమెలాగో అర్థం కాలేదు. మొదట కూర్చుని ప్రయత్నించింది. వొళ్ళో వున్న బిడ్డ నోటికి అందేంతగా వొంగేసరికి నడుము ఎముక కణేల్మంది. ఓ పక్కకి తిరిగి పడుకొని యిద్దామనుకుంటే చంటిది నలిగి పోవడం మొదలెట్టింది. వినుగొచ్చేసింది వింధ్యకు. ప్రపంచం అంతా యిటే చూస్తున్నారనిపించే బెరుకు, పిల్లదాని అమాయకమైన మొహం ఒకేలా ఇబ్బంది పెట్టేస్తున్నాయి. రొమ్ము తగిలించిన నిప్పిల్ షీల్డ్ మాటి మాటికీ జారి పోతోంది. యింకోసారి కదలకుండా పట్టుకొని దానికున్న రబ్బరు పీక లాంటిది చంటిదాని నోట్లో పెట్టింది. ప్లాస్టిక్ వాసనొచ్చే ఆ పీకను నాలికతో నెట్టేసింది చంటిది. మళ్ళీ మళ్ళీ పెట్టే సరికి గత్యంతరం లేక పెద్ద చప్పుడు చేస్తూ చప్పరించడం మొదలు పెట్టింది. అది కూడా వాక్యూమ్




మాదిరిగా చను మొన మొత్తం లోపలికి లాక్కుని పాలు పిండుకుంటోంది. షీల్డ్ లోంచి పీకలోకి దానికున్న రంధ్రంలోంచి పసి దాని నోట్లోకి ఒక్కో చుక్కా వెడుతున్నాయి. కాసేపటికే బుగ్గలు నొప్పెట్టి ఏడవ సాగింది. ఎడమ వైపు సగం తాగి వదిలే సరికి కుడి వైపు ధారగా పాలు...పమిట చెంగు తడిసి వొంటికి అతుక్కు పోతోంది. ఎదుటి బెడ్ తాలూకు బంధువెవరో నిర్లజ్జగా ఇటే చూస్తున్నాడు. నిప్పిల్ షీల్డ్ తగిలించినంత మేరా చను మొట చుట్టూ ఎర్రగా నొక్కు పోయిన గాయం... చేత్తో నిమురు కోవాలనిపిస్తోంది. నోటితో గాలి వూదుకోవాలనిపిస్తోంది. మాతృత్వం యింత దుర్భరమా? వొళ్ళు జలదరించింది.

చంటిది అలసిపోయి నిద్ర పోవడం మొదలెట్టింది. పెదాల చుట్టూ నిప్పిల్ షీల్డ్ తాలూకు డొక్కలు ఎగరేసుకుంటూ ముడుచుకు పోయిన ఆ చిన్న ప్రాణాన్ని చూస్తే జాలేసింది.

* * * * * *

ఉన్న పళాన మళ్ళీ విరుచుకు పడిన పర్వతాన్ని ఛీత్కారంతో పక్కకి తోసి చంటాణ్ణి అందుకొంది కనకం. పక్క తడుపుకొని ఏడుస్తున్నాడు వాడు.

"తోస్తావుటే నీ యవ్వ..." ఈడ్చి చెంపమీద కొట్టాడు పర్వతాలు. ఆ అదురుకు కనకం తల గోడకేసి కొట్టుకుంది.

ఆగడానిగ్గాని, జవాబు చెప్పడానికి గాని సమయం లేదు. కక్కటిల్లి పోతున్న పిల్లాణ్ణి రెక్క పట్టుకుని చాప్మీద కుదేసి జారి పోతున్న చీర కుచ్చెళ్ళు తొక్కుకుంటూ పడబోయి నిలదొక్కుకుంటూ నాలుగడుగులు నడిచి అక్కడ యిస్త్రీ బట్టల కోసం రాజుకుంటున్న నిప్పుల కుంపటి మీద చిన్న గిన్నె నీళ్ళు పడేసి పాల డబ్బా కోసం వెతకడం మొదలెట్టింది.


తల అదురుతోంది. గుండెలు మండుతున్నాయి. డమ డమ డమ డమ డబ్బాలు ఎత్తెత్తి కొడుతూ వంటింటి గోడంతా తిరిగదోడింది. పాలడబ్బా ప్రత్యక్షం కాలేదు. ఏమయిందబ్బా యిక్కడే వుండాలి కదా? పదే పదే గొణుక్కుంటుంటే హటాత్తుగా గుర్తొచ్చిది, పక్క వాటా సాయిలక్ష్మి అరువు పట్టుకెళ్ళిందని...!

" సాయీ ఓ సాయమ్మా" తడికె కంతల్లోంచి కళ్ళు చిట్లించి చూస్తూ పిలిచింది.

"ఇదిగో అక్కా యిందానే తెద్దామనుకుంటి గాని... నువ్వేదో పన్లో వున్నావని..." నవ్వింది సాయి.

"దొంగ ముండ అన్నీ చూసే వుంటుంది. దీనికి వెయ్యి కళ్ళు, పది వేల చేతులూనూ – పళ్ళు నూరుకుంది కనకం. డబ్బా మూత తీసి చూస్తే అడుగున పిసరంత పాలపిండి...ఉసూరుమంటూ కనిపించింది.

హయ్యో ఎలా? ఏం చెయ్యాలి. భూకంపం వచ్చినట్టు కంగారు పడింది. ఊపిరాడకుండా ఏడుస్తున్న చంటాడి దగ్గరకి పరిగెత్తి కొసలు చిట్లి నెత్తురు చిమ్ముతున్న స్తనాన్ని వాడి నోట్లో పెట్టింది. మొహం చిట్లిస్తూనే మెల్లి మెల్లిగా



తాగడం మొదలెట్టాడు. నెత్తురో, పాలో తెలీదు కాని, మొత్తానికి వస్తున్నట్టే వున్నాయి. తల ముందుకు వొంచి గుండెల మీదా, భుజాల మీదా వాసన చూసుకుంటే డోకొచ్చినంత పన యింది. భయంకరమైన గుట్కా, బ్రాందీల వాసన... కడుపులో తిప్పేసింది.

రోజుకో యింత చొప్పున యిదంతా పసివాడి నోట్లోకి వెడితే...? కనకానికి భయమేసింది. ఇందుకేనేమో వారం నుంచి తెరిపిలేని జ్వరం ఉప్పెనలా ఊపేస్తోంది. తల్లి పాలే విషం చేస్తున్న అయ్యల రాక్షసత్వం నుంచి బిడ్డల్నెలా సాదుకోవాలి? గందర గోళంగా వుంది. రొమ్ము తప్పించి బిడ్డను వొళ్ళో బోర్లా తిప్పి జోకొట్టడం మొదలెట్టింది. ప్రాణం పోయినట్టుగా ఏడుపు లంకించుకున్నాడు వాడు. పాలిచ్చి క్రమ క్రమంగా చంపాలో పాలివ్వకుండా అమాంతం చంపాలో తల్లి ప్రాణానికి పరీక్ష పెట్టనట్టే వుంది. అన్నింటికీ కారణమైన తండ్రి గాఢ నిద్రలో గొణుగుతున్నాడు.

"చెట్టంతటి మడిసిని నన్ను తోస్తావుటే..."

* * * * *

"రైయిట్" గట్టిగా అరుస్తూ మనుషుల్ని తోసుకుంటూ వెనక్కి వస్తోంది గిరిజారాణి. రద్దీగా,రొదగా కాకులు దూరని కారడవిలా వుంది ఆర్టీసీ బస్సు.

'రైట్ రైట్' అంటున్నట్టుగా విజిల్ తీసి వూద బోయి కదిలే సరికి మానేసి ఎంట్రన్స్ మెట్టు మీద కాసేపు నుంచొని టిక్కెట్లు లెక్క చూసుకుంది. ఎక్కడో గాని తేడా వచ్చేసింది. ఆలోచించే లోపు యింకో పది మంది దాకా ఎక్కారు. లోపలి కొచ్చి మళ్ళీ వాళ్ళందరికీ టిక్కెట్లిచ్చి డబ్బులు తీసుకుంది. కోసిన టిక్కెట్లకి, తీసుకున్న చిల్లరకి బ్యాలెన్స్ కుదరడం రోజూ ఒక యుద్ధం.

గిరిజారాణికి ఇప్పుడు రోజు వారీ యుద్ధాలతో బాటుగా మరో కొత్త యుద్ధం వచ్చి పడింది. అదేమిటంటే 'మాతృత్వం' ముంచెత్తిన యుద్ధం. డ్యూటీలోకి వచ్చే ముందే బిడ్డని బలవంతాన నిద్రలేపి దానికి పాలివ్వాలని అనుకుంటుంది. సగం తాగి నిద్దరోయిన పిల్లని కుదిపి కుదిపి పట్టినా యింకా లోన మిగిలిపోయినట్టే అనిపిస్తుంది. రక్తపు జీర కనిపించే వరకు ప్రాణమంతా చిదిమి చిట్టిగిన్నెలోకి పిండేసి సరిగ్గా గంట తర్వాత తాగించమని అక్కకి పురమాయించి బయటికొచ్చే సరికి ఏడు గంటలు. ఓ పక్క డొక్క మాడుతూనే వుంటుంది. కడుపు నిండా ఏ టిఫిన్ తిందామన్నా పాలు నిండుకొస్తాయనే భయమే. ఇంట్లో వున్నంత సేపు బాధ లేదు. డ్యూటీ టైమ్‌లో ఎలా? అంతక్రితం నుంచి కూడా ఆర్టీసీ ఆడ బతుకులకి బాత్రూం సౌకర్యం లేక పోవడంతో మొదలైన ఆర్ధాకలి, తిండీ, అరకొర నీళ్ళూ, పాల నలువు భయంతో నిరాటంకంగా కొనసాగుతున్నాయి. కిటికీ పక్కన కూర్చుని ఎవరో అరటి పళ్ళు తినడం మొదలెట్టారు. పల్లీలు, బఠాణీలు అమ్మకాని కొచ్చాయి. అటుకేసి చూస్తే ఆకలేస్తుందనే ఆలోచనతో గిరిజారాణి తల యిటు తిప్పుకుని కొత్తగా ఎక్కిన మరో వలుగురికి టిక్కెట్లు కొట్టి రైట్ అని అరిచింది.

వాచీలో సాయంత్రం ఆరున్నరయింది. పది గంటలు దాటితే గాని యింటికెళ్ళే ప్రాప్తం లేదు.

సమయం గడుస్తున్న కొద్దీ పాలు నిండుకొచ్చిన సూచనగా స్తనాలు బిరుసెక్కడం మొదలెట్టాయి. యూనిఫాం తీసి విసిరి గొట్టాలనిపిస్తోంది. వడగళ్ళ మీద వడ గళ్ళు పేర్చినట్టు గడ్డ కట్టిన పాలు చురుకు చురుకు మనడం ప్రారంభించాయి.

ఇంకా నాలుగు గంటలు గడవాలి. పంటి బిగువున అనుకుంది. లబ్బీ పేటకి మూడు" యాభై నోటిచ్చి దర్జాగా అడిగాడొకడు.

మొదటి అర లోంచి మూడు వదుల కాయితాలను దొరకబుచ్చుకుని చిల్లర కోసం బ్యాగంతా ఎగరేసి వెతుకుతుంటే చేతి కింద వరకూ పాకిన చుర చుర బాధ యింకాస్త ఎక్కువైంది. సడన్ బ్రేక్‌తో ఆగినట్లయింది బస్సు. బాధని గాలి కొదిలి గబ గబా ముందుకెళ్ళి చూసింది. రోడ్డంతా ట్రాఫిక్ జాం... దాదాపు పది బస్సుల వరకూ కునికిపాట్లతో కనిపించాయి.

బస్సులో వున్న జనాభా మొత్తం రక రకాల భాషల్లో విసుక్కున్నారు. విసుక్కో కూడని హోదాలో వుండిపోయిన కండక్టరు గిరిజారాణి నిశ్శబ్దంగా నుంచుంది.

ఇప్పుడు చుర చుర బాధలు కరిగి ప్రవహించడం మొదలెట్టాయి. యూనిఫాం చొక్కాకిందున్న లోపలి వస్త్రాలు తడిసిపోయి పిడచకట్టుకు పోయాయి. గిరిజారాణి వికారంగా మొహం పెట్టి నుంచుంది.

"పాలివ్వడం నామోషీ కాదు, అది బిడ్డకు ఆరోగ్యం" గోడ మీద గవర్నమెంట్ వారి స్లోగన్ వెక్కిరించినట్టయింది.

* * * * *

గుమ్మం లోకి అడుగు పెడుతూనే గతుక్కుమంది రిహానా. అప్పుడే బాటిల్‌తో పాలు పట్టడం పూర్తి చేసి, ఒక్క క్షణం – అన్నట్టుగా సైగ చేసి బిడ్డకు దుప్పటి కప్పి, ఫ్యాన్ స్పీడ్ తగ్గించి లోపలి గది దాకా రానిచ్చి అప్పుడు గొంతెత్తి అరిచింది రుక్మిణి.

"ఎందుకొచ్చావ్? నువ్వు రానవసరం లేదు. వెళ్ళిపో."

"నయా బీ బీ. బస్సు దొరక లేదు. గిప్పుడు నాస్తా జేసి యిటొస్తున్నా. బిడ్డ నివ్వండి. దూద్ పిలాంలోంగా" బతిమలాడ్డం మొదలెట్టింది రిహానా.

"నక్కో. నాస్తా జేసి వస్తున్నావో, వున్న పాలు కాసినీ నీ బిడ్డకు యిచ్చి వస్తున్నావో నే చూళ్ళేదు కదా? అయినా, యింక నీతో మాటలనవసరం" రుక్మిణి అటు తిరిగింది.

"నై బీ బీ నా బేటీకి గంజినీళ్ళే పడుతున్నాను. అల్లామీదొట్టు. నాస్తా చేసి రావడానికే ఈ పొద్దయింది." బతిమలాడింది రిహానా.


అమ్మగారు కరగదల్చుకోలేదు. లోపలి కెడుతూనే బీరువా తీసిన చప్పుడు వినిపించింది. నిస్సహాయంగా నుంచుండి పోయింది రిహానా.

రెండు వంద కాయితాలూ, యింకో యాభై చిల్లరా తెచ్చి చేతిలో పోసి "లెక్క చూసుకో ఈ నెల్లో బాకీలు పోను నీ కివ్వాల్సిన మొత్తం యిదే" అంది కరా ఖండీగా.

రిహానాకి ఏడుపొచ్చేస్తోంది. ఉప్పెనలో కొట్టుకు పోతున్నప్పుడు చేతికి దొరికిన గడ్డి పోచ కాస్తా జారి పోతున్నట్టనిపించింది.

"అదికాదమ్మా..." చేతులు పట్టుకుంది దుఃఖంతో.

"ఇంకేమీ చెప్పకు. మువ్విస్తున్నవి చాలట్లేదు కాబట్టే నా బిడ్డకు డబ్బా పాలు కూడా పట్టాల్సి



వస్తోంది. రాత్రిళ్ళు వుండి పొమ్మంటే వినవు" పట్టుకున్న చేతులు విదుల్చుకుని దూరం జరిగిందది రుక్మిణి.

"నా దగ్గరున్నవన్నీ నీ బిడ్డకే యిస్తున్నామ్మా ఆరొందల కోసం..." రిహానాకి అంతకంటే మాటలు పెగల్లేదు.

"ఆరొందల కోసమైనా ఆర్రూపాయల కోసమైనా నీ దగ్గర యివ్వడానికి పాలున్నాయి. అంచేతే కదా ఆ టెక్కు." చివరి మాటలు అంటున్నప్పుడు రుక్మిణి గొంతు జీర బోయింది.

ఆర్నెల్ల క్రితమే కోతకు గురయిన గుండెలు దుఃఖంతో దడ దడ లాడాయి.

"ఏమిటా కీచులాట...ఎప్పటికి తెముల్తుంది?" టి.వి.సౌండ్ తగ్గించి లోపలి గదిలోంచి అరిచాడు ఇంటి పెద్ద.

సౌండ్ తగ్గిన పాట తల్లు లిద్దిరికీ కర్ణ కఠోరంగా వినిపించింది.

"మాతృత్వంలోనె వుంది ఆడజన్మ సార్థకం
అమ్మ అనిపించుకుంటె స్త్రీ మూర్తికి గౌరవం."

* * * * *

వదులు

"వదల్ను"

వదులు

బలమైన మేకా, బక్క చిక్కిన వులీ వాటి భాషలో అవి కలియబడుతున్నాయి.

"మే...మే...మే..."

"గాండ్ర్...గాండ్ర్...గాం...డ్ర్...ర్...ర్"

మేక అరువుబలహీన పడుతోంది.

దొరికిన ఆహారంతో కలియబడీ, కలియబడీ వులి కూడా కాస్త రొప్పతోంది.

"సరే ఒదలకు" మేక రాజీ కొచ్చింది.

"ఔనా... ఔనౌనా...ఔనౌనూ... ఔనూ ఔనా!?" కోరల మధ్య యిరుక్కున్న మేక తలను విడుదల చేసి సంబర పడ్డం కోసం నోరంతా తెరిచింది. సమయం చిక్కినా పారిపోలేదు మేక. పైగా తలొంచి నుంచోవడం చూసి నిబ్బరం పెరిగింది వులికి. అంచేత అటూ ఇటూ చూసింది. "ఈ అడవికి రాజును నేనే నా?" అరిచింది. అడ వంతా ప్రతిధ్వనించింది. మూతి కదిలించి మీసం ఎగరేసింది. తోక వుంటే ఎంత బావుండేదో! పతాకా విష్కరణ చేసే పని కదా అని విచారించింది. గట్టిగా గాలిపీల్చి నాలుగైదు చీమల్ని స్వాహా చేసింది.

వులి హావ భావాలు చూశాక అంత చావు భయంలో కూడా చచ్చేంత నవ్వొచ్చింది మేకకి.

"వులి వులీ కొంత సేవు ఆగుతావా? నా బిడ్డకు పాలిచ్చి బాకీల్లేని చావు కోసం ప్రార్థన చేసుకొని మరీ వస్తాను. మాటతప్పను. నీ మీదొట్టు, నీ జూలు మీదొట్టు, నీ కాలి గిట్టల మీదొట్టు, చంపిన జీవాన్ని గెట్ టు గెదర్ పెట్టి పంచుకోమని చెప్పగల నీ ఔదార్యం మీదొట్టు." మేక శ్లోకం మొదలెట్టింది.

వులికి మైకం ముంచుకొచ్చింది గాని ఎందుకైనా మంచిదని అడిగింది. "అన్నమాట ప్రకారం నువ్వు వస్తావని గ్యారంటీ ఏమిటి?" నింద భరించలేక పోయింది మేక. విల విల్లాడుతూ నాలుగు కాళ్ళ తోనూ వాగ్దానం చేసింది.

వులికింక నేలమీద నుంచో బుద్ధి కాలేదు. "సర్లే పోయిరా!" అనుమతి యిచ్చేసింది."అరగంటలో రాక పోయావో మందకి మందా కర కరా నమిలి మింగేస్తా" ఎందుకైనా మంచిదని ఓ మాట అడ్డం వేసింది. ఆ మాటల్లో వుండాల్సినంత కరుకు వుండకపోవడం మేకపోతు కనిపెట్టింది. కనిపెట్టిన క్షణాన్నే కొంచెం ప్రేమించడం కూడా మొదలెట్టింది. అఫ్‌కోర్స్ అది వైర ప్రేమ కావచ్చు.

గౌతమ బుద్ధుడిలా మారిన వులికి నమస్కరించి గభాల్న అంత దూరానికి ఎగిరింది మేక. ఎగరడమే పాపంగా ఒక పెద్ద గోతిలో పడిపోయింది. అంత వరకూ అక్కడొక ప్రమాదం ఇద్దరి కోసమూ పొంచి వున్నట్టు తెలీనే లేదు. ఉన్న పళాన ఉలిక్కిపడి రెండడుగులు వెనక్కేసింది వులి.

అచ్చంగా నేల మీదున్నట్టే అమర్చి పెట్టిన ఎండు టాకులూ, మట్టి వుండలూ, కర్ర ముక్కలూ కసిదీరా కుమ్మి కుమ్మి గోతిలో వుండిపోయింది మేక.

ఇద్దరి గుండెలూ ఒకేలా గుభిల్లుమనడం ఆ గాలికి తెలిసిందేమో! మద్దతుకోసం అన్నట్టు గోతి లోంచి ఒక కాగితం పైకెగరేసింది. నెల క్రితం అచ్చయిన ఒక దిన పత్రికలో ఒక శకలం.

పోలీస్ క్యాంపు వైపుగా నడిచి వెడుతున్న ఓ గోండు స్త్రీని నక్సలైట్ అయివుంటుందనే ఒక ఆధారం లేని నమ్మకంతో తల్లినని పాలివ్వటానికి యింటికి పోతున్నానని చెప్పినా వినకుండా దాని రుజువు కోసం పాలిండ్లను హింసాత్మకంగా పిండి చూశారనే వార్త వుంది.

వాసన పోల్చడం తోనే మనుషుల్నీ వాళ్ళ దుర్మార్గపు ఆలోచనల్నీ, అచ్చయిన వార్తల్నీ పసికట్టిన వైర జాతులు రెండూ ఒక దాని వంక ఒకటి జాలిగా చూసుకున్నాయి.

'ఏమిటీ మనిషి జాతి యింత నీచాతి నీచం గావా వుండేది? తల్లులు పాలిస్తారని చెప్పడానికి రుజువులు కూడా యిచ్చుకోవాలా?' వులికి గుండె తరుక్కుపోయింది.

'ఇద్దరు బానిసల ముద్దు బిడ్డ కాబోలు మనుషుల రాజ్యమంటే.'

ఒకటి బాధించేది, రెండు బాధ పడేది. హతోస్మి!' అనే సరికి మేకపోతుకి మూర్ఛవచ్చినంత పని యింది. ●

